# చాదస్తుల ఖర్మాగారం

"మీ యింట్లో ఏం పూజ? మీ అక్కయ్య కింకా పురుడు రాలేదేమిటే?" అన్నది అమ్మమ్మగారు అంటే సుభద్రమ్మ – కళ్ళ జోడు మనిషి.

"మా అక్కయ్య కొడుక్కి ఈ వేళ పేరు పెడుతున్నారండీ! సత్యన్నారాయణ వ్రతం. మా బావ, వాళ్ళ అమ్మగారు, నాన్నగారూ అంతా వచ్చారు. మందార పూలు అన్నీ కాసేపైతే రాలిపోతాయండీ!" అన్నది శాంత, తన పేరుకి తగినట్లుగా.

"కొడుకు పుట్టాడా? ఎప్పుడే? మీ అమ్మయినా చెప్పింది కాదు. అయితే, పిల్లాడు మీ బావలా జీడిగింజ రంగా, మీ అక్కయ్యలా చామనచాయా?" అన్నది సుభద్రమ్మ.

"మా అమ్మలా తెల్లగా ఉన్నాడండీ.. ఆలస్యమైతే మా అమ్మ కోప్పడుతుంది" అంటూ యింక జవాబు కోసం ఆగకుండా, చెట్ల వేపుకి పరుగుతీసింది శాంత.

"ఒసేవ్ శాంత! మెట్ల మీద పడేసినట్టుంది ఆ రేకు సామాన్లు. బంగారం లాంటి బక్కెట్లన్నీ ఎవడేనా పట్టుకుపోతాడు. కాస్త లోపల పడేయమ్మా! వూ,అయితే ఈ వేళయినా పెందరాళే చేస్తుందా మీ అమ్మ వంట? పిల్లాడికి పేరేం పెడుతున్నారు?" అంటూ సుభద్రమ్మ వెనకాల గట్టిగా అంటూనే వుంది.

ఈ లోపుగా శాంత మందార పూలు కోసుకుని ఆ ప్రక్కనే వున్న గన్నేరు గుత్తులూ, నీలాంబరాలు, నూరు వరహాలు, సెంటు మల్లెలు, ఎర్రచామంతులు తుంపుకుని, క్రింద రాలిన పారిజాతాలన్నీ వడి నిండా ఏరుకుని యింకేమీ మిగల్లేదు కదా అని చుట్టూ చూసి, గేటు తీసి, ఖడాలున మూసి, యింటికి పరుగెత్తింది.

ఈసారి గేటు చప్పుడు, గదిలో మడతమంచం మీద మేను వాల్చిన వున్న విశ్వనాధానికి వినబడింది. ఆయన రిటైరుమెంటుకు ముందు మూడు నెలలు సెలవు పెట్టి, యింట్లోనే వున్నాడు. పేపరు కింద పడేసి, ఆయన ముందు గదిలోకి వచ్చి అత్తగారిని చూచి, "ఎవరా వచ్చింది?" అన్నా

సుభద్రమ్మ కొంచెం ఆగి, "ఎవరొచ్చారు?" అన్నది. ""అదే నేనూ అడిగేది. బక్కెట్లు లోపల పెట్టమన్నారు మీరు. పిల్లాడు దబ్బపండా అని అడుగుతున్నారు ఎవరా అని?" అన్నాడు విశ్వనాధం విసుగ్గా. ఆయన కసలు అత్తగారి చాదస్తం చూస్తే చాలా చీకాకు.

"దబ్బపండు కాదు జీడిగింజ" అన్నది సుభద్రమ్మ క్లుప్తంగా అల్లుడు దూకుడు చూస్తే ఆవిడకు బొత్తిగా నచ్చదు.

విశ్వనాధం ఇంక సంభాషణ పెంచకుండా గుమ్మం వరకు వెళ్ళి "ఈ బక్కెట్లు, డబ్బాలు యిక్కడ పడేశారేం? వానకు తడిస్తే  తగలపడిపోవూ? ఎండకు ఎండి తుప్పుపట్టిపోతాయనైనా లేదు. ఈ గేటు తలుపు తీసే చక్కా పోయిందేం?" అంటూ పల్లవి, అనుపల్లవి, చరణాలుగా సణుగుతూ మెట్లు దిగి గేటు తలుపు వేశాడు.

ఏదో ఉపన్యాసం, చర్చా కార్యక్రమాలు ఆరంభమయినాయని, లోపలున్న వరలక్ష్మి గ్రహించింది. సుభద్రమ్మకి ఆమె ఒక్కతే కూతురు కావడాన ముసలితనంలో వచ్చి వీరింటనే వుండిపోయిందామె.

చేతిలో పని ముగించుకుని త్వరత్వరగా బయటికి వచ్చి "ఏమిటండీ అంటున్నారు?" అన్నది వరలక్ష్మి.

"నేనేమన్నానిప్పుడు?" అన్నాడు విశ్వనాధం. చుట్టూ చెట్ల వేపు చూసిన వరలక్ష్మి "పసిమొగ్గలు కూడా తుంపుకుని పోయినట్లుంది ఏమండీ, యీ బక్కెట్లను చూడండీ, ఏడు రూపాయలిస్తాట్ట. ముఫ్ఫైరూపాయలవుతాయి కొనబోతే!" అన్నది ఆ బక్కెట్లు సవరిస్తూ. రెండు నెలలుగా పాత సీసాలు కొనేవాళ్ళకీ, వరలక్ష్మికి ధర విషయంలో అభిప్రాయం కలవక, అవి పెరట్లోకి, ముందు వీధిలోకి ప్రయాణం చేస్తున్నాయి.

"ఇదిగో చూడు, ఈ గేటు గొళ్ళెం తీసినప్పుడల్లా రంగు పెళ్ళలుగా వూడి వస్తోంది. అన్నీ దండగలే. ఏమిటంటావు?" అన్నాడు.

వరలక్ష్మి యధాశక్తి తను అన్నమాట ఏదో మర్చి పోయి, "నేనా, నేనేమిటన్నాను?" అన్నది.

"బక్కెట్టుకి ఏడురూపాయలిస్తానన్నాడని ఏవో అన్నావుగా నీ మతి మండినట్టే వుంది. డెభ్భై రూపాయ లవుతాయి కొనబోతే. బజారుకెళ్ళి ఏదైనా చూసి చస్తేగా?" అని విశ్వనాధం భార్య తెలివితక్కువ తనాన్ని ప్రస్తుతించాడు.

"అబ్బో డెభ్భైరూపాయలే! నయమే – మా అమ్మ ఏడుంపావలా అంటే ఇచ్చేద్దామనే అనుకున్నాను. లోపల పడేయండి. ఎవడేనా చేతబుచ్చుకుని పోతాడు" అన్నదామె.

సుభద్రమ్మ రామకోటి వ్రాస్తూనే యీ సంభాషణ విని తన మామూలు అయోమయం ధోరణిలో, "పోనీ ఆరున్నర యిస్తాడేమో, యిచ్చేసి రెండు కొత్త బక్కెట్లు పట్టుకు రమ్మను" అని ఒక సలహా పారేసింది.

ఈ చచ్చు సలహాకి భర్త ఏమంటాడోనని వరలక్ష్మి ఆయన వంక చూసింది. ఆయనకీ లోపుగా పడక్కుర్చీలో పడేసిన ఇంగ్లీషు పేపరు కనపడింది. "ఈవేల్టిదేనా యిది? చూశావా లక్షణం! పన్నెండో పేజీ నేలమీద, పదహారో పేజీ చింతపండులాగ నలిగిపోయీ, ఒకటో పేజీ అయిపే లేదు. హు వస్తువులకి ఒక విలువ ఏడ్చిందా యీ కొంపలో?" అంటూ కాలేజీకి వెళ్ళిపోతూ పేపరు అలా పడేసిన కూతురు మీద విసుక్కున్నాడు.

వరలక్ష్మి యీ లోగా లోపలికెళ్ళి పట్టుచీరె సింగారించుకుంది. "అన్నీ మూతలు పెట్టి, పీట వాల్చి వుంచాను. వడ్డించుకుని భోంచేయండి. పోనీ యిరుగు, పొరుగు కదా పిలిచారు వెడదామని వుంటేగా? ఒంటెత్తు మనుష్యులకి ఎవరు చెప్పగలు?" అన్నది తలదువ్వుకుని, యిన్ని పూలు తురుముకుంటూ.

విశ్వనాధం ఒక్క క్షణం చూసి, "ఏమిటి నువ్వనేది? సబ్జక్టు, రిఫరెన్సు లేకుండా మాట్లాడుతావు కదా – ఓహో! పక్కవారింట్లో బారసాల భోజనమా? నువ్వెళ్ళిరా. కరువు రోజుల్లో వ్రతాలేమిటి, విందులేమిటి? తినేది ఎవరి సొమ్మయినా బాధే. అందుకే రానన్నాను" ఆయన చెట్టు, చెట్టు పరికిస్తూ తన కష్టార్జితం తాలూకు పైసా పైసా సొమ్మును గురించి ఆప్యాయత పడిపోతున్నాడు.

వరలక్ష్మి తల్లికి అన్నం పెట్టి, అన్నీ సవరించుకుని యివతలికి వచ్చి, "అమ్మా తలుపు జేరవేసుకో. ఏమండీ మీరు తిన్నాక పెరుగు, నెయ్యి లోపల అరమారలో పెట్టండి. మాయదారి పిల్లి కాపలా వేసే వుంటుంది.

పెరట్లో కొత్త తువ్వాలు ఆరవేసినట్లున్నారు. లోపల పడేయండి. వాన చినుకులు పడతాయేమో మడత మంచం లోపలకి యీడవండి. ఈ బక్కెట్లు మీ భోజనమైనాక లోపల పెట్టండి" అంటూ కొద్దిగా పని పురమాయింపులు చేసి, పక్కింటికి భోజనానికి బయలుదేరింది.

విశ్వనాథం భోజనం చేశాక పెరట్లో కొట్టుగది తాళం తీసి అందులో సామాను సపరించసాగాడు. పాత బల్ల, కుర్చీలు, రేకు పెట్టెలు, వూడిన గొళ్ళేలు, విరిగిన తలుపు చెక్కలు అలా చిన్న మ్యూజియం వుంది ఆ గదిలో. తలుపులు తీసి సర్దినవే సర్దుతున్నాడు.

ముందు గేటు చప్పుడైంది. ఈలపాట వినిపించింది. కిరణ్మయి వస్తూనే పుస్తకాలు కుర్చీలో గిరవాటేసి యింకాస్త గట్టిగా ఈలపాట సాగించింది. సుభద్రమ్మ తలెత్తి చూసింది. 'ఆడపిల్ల, రౌడీలా ఈల వేస్తుంది. ఆ తల్లయినా చెప్పదు'. అన్న భావంతో నోరాడించింది. కోపంతో ఆడుతున్న అమ్మమ్మ దవడలు చూచి కిరణ్మయి "హాల్లో అమ్మమ్మా!" అంటూ ఆమె బుగ్గలు పుణికింది.

అంతలో అలక తెచ్చుకుని "ఎన్నిసార్లు చెప్పాలి? ఆ డొక్కు బక్కెట్లు వీధిలో ఎదురుగా పెట్టొద్దని, రాగానే మూడ్ అంతా పాడు. అవతల పారేస్తానీసారి!" అన్నది గట్టిగా.

ఈలోగా శాంత ఒక గిన్నె ప్లేటు మూతతో పట్టుకొని వచ్చింది. అవి కిటికీలో పెడుతూ "కిరణ్! మాఅమ్మ నిన్ను రమ్మంది భోజనానికి" అన్నది.

"ఓహ్! మీ యింట్లో ఈ వేళ పూజ కదూ, రమ్మన్నావు. కానీ యివేమిటో పట్టుకొని వచ్చావు తినేయడానికేగా!" అని ప్లేటు మూత తీసి, ఇంత రవ్వకేసరి నోట్లో పడేసుకుంది. సుభద్రమ్మ కోపం తాటాకు మంటలా మళ్ళీ అంటుకుంది. అది ప్రసాదం కదా! వీధిలో అడ్డమైన వాళ్ళతో తిరిగొచ్చి "ఆ బట్టలయినా విడవకుండా తినడం! ఆ తల్లయినా ఎప్పుడూ చెప్పదు యిలాంటివి చేయకూడదని."

"అమ్మమ్మగారు! మీకు యిమ్మన్నదండీ మా అమ్మ. కిరణ్, నిన్నూరమ్మన్నది మా అమ్మ భోజనానికిరా" అని చేయి పుచ్చుకుంది.

కిరణ్మయి భుజాలెగరేసి, "నాకు బోర్ బాబూ పూజలంటే... ఈ స్వీటుకి థ్యాంక్సు చెప్పు" అన్నది. తను శాంత వంక చూడకుండా "అమ్మమ్మా ఈ బక్కెట్లు గోడవతల పారెయ్యనా?" అన్నది.

"నాకు తెలియదు తల్లీ, మీ నాన్న నడుగు, మీ అమ్మనడుగు.. శాంతా, మా కిరణ్ రాదమ్మా పూజకి. ఆ మాటే మీ అమ్మతో చెప్పమ్మా" అన్నది. శాంత చిన్న బుచ్చుకుని, బయటికి వచ్చింది.

పెరట్లోకి చూసింది కిరణ్. పరమ డొక్కు సామాన్ల స్టోరు రూమ్ దగ్గర, నాన్న కనబడేటప్పటికి చకచకా పరుగెత్తుకుని వెళ్ళి,

"డాడీ ఏమిటి యీ కచరా అంతా? పారేయాల్సిందే మొత్తం అంతా! పాములు దూరి కూర్చున్నా తెలియదు. ఎన్ని సార్లు చెప్పినా చూడండి డాడీ, అమ్మ, అమ్మమ్మ కలిసి ఆ చెత్త బక్కెట్లు వీధిలో పెడతారు. మొన్న మా లతా, గీతా వచ్చినప్పుడు కాళ్ళకి తగిలి, క్రింద పడేంత పనైంది. ఇదేమిటే యీ మ్యూజియం అని నవ్వారు కూడా" అన్నది కిరణ్, గారాలుపోతున్నట్లు.

మ్యూజియం అనడానికి కావలసిన అన్ని హంగులూ వున్నాయి ఆ గదికి. పాతనాటి హెచ్.ఎమ్.వి. గ్రామఫోను గొట్టం, ఆ పక్కనే వెడల్పాటి చెక్క పట్టీల పడకకుర్చీ, దాని వళ్ళో ముద్దుగా వ్యాసపీఠం వామనగుంటల పీట, గోడలకి కొట్టే చిలుక కొయ్యలు, ఉత్తరాలు దాచుకునే అరల చెక్కపెట్టె, చిఠాపుస్తకాలు దాచుకునే పెట్టే వున్నాయి. వాటిని తీరుగా సర్దాలని ప్రయత్నిస్తున్న విశ్వనాథం, ఏకైక పుత్రిక మాటలు ఏవో ఆకాశవాణిలా వినబడి,

"ఏమిటమ్మా అంటున్నావు?"

"ఏమీలేదు నాన్నా! లతా, గీతా నవ్వారు మొన్న యీ సామాను చూచి అంటున్నాను. మీరు ముందు బయటికి రండి" అన్నది.

"లతా, గీతా వచ్చారా? ఏరీ?" అన్నాడాయన.

"మీరు ముందివతలకి రండి. ఒక అగ్గిపుల్ల గీచి, ఆ సామాను మీద పడేస్తాను" అన్నది బిగ్గరగా. కళ్ళజోడు పెట్టుకున్నవారికి చెవులు వినిపించవన్న దురభిప్రాయం వున్న యువ మేధావి కాబట్టి, కిరణ్‌కి అల్లా అరవడం అలవాటైంది.

విశ్వనాథం యీసారి ముఖం చిట్లించి, "సరేలే.. వున్నవన్నీ తగుల బెట్టుకుంటే, రేపు కొనబోతే వేలరూపాయలు కావాలి తెలుసా?" అన్నాడు.

"ఆ గ్రామఫోను గొట్టం, యీ చెక్కపెట్టె పాత తెలుగు పేపర్లు, యీ ట్రాష్ అంతా మనం మళ్ళీ ఎందుకు కొంటాం డాడీ! మీరసలు రెండురోజులు ఆఫీసుకు వెళ్ళి పొండి. నేను పట్టిస్తాను వీటిపని" అన్నది కిరణ్మయి.

"మీకసలు వస్తువుల విలువ తెలియదమ్మా కిరణ్! మీరు పెద్దయి సంపాదిస్తే తెలుస్తుంది" అన్నాడాయన కూతుర్ని వదిలించుకోవాలన్న ధ్యాసతో. "మీ అమ్మ వచ్చినట్లుంది చూడు.. గేటు చప్పుడైంది" అన్నాడు.

నిజంగానే వరలక్ష్మి వచ్చింది. కిరణ్ వెళ్ళి ఆవిడ చేతిలోని అరటి పండు గుంజుకుని, గుటుక్కుమని రెండు ముక్కలు చేసి మింగేసింది. ఆవిడ గది గుమ్మంలోకి వస్తూనే "కిరణ్ ఆ దిక్కుమాలిన బ్లూపాంట్ పారేయమని ఎన్నిసార్లు చెప్పాలి? వెలిసిపోయి, బిగువైపోయి ఆ పాంట్ ఏం ఫ్యాషనే నీ తలకాయ! ఇలా చూడు యీరాళ్ళు, ఎండాకులు అన్నీ పోగేసుకొచ్చావు. అలమారులో బొట్టు భరిణె తీస్తే అవన్నీ నా నెత్తిన పడ్డాయి. కాలేజీకి వచ్చావు గాని నీకు బుద్ధి ఎప్పుడొస్తుందే? ఆ బొమ్మల పత్రికలో పాడు బొమ్మలన్నీ కత్తిరించి మంచం మీద పోశావు. నాన్నగారికి కాస్తుంటే చేతిలో దిగిపోయేది కత్తెర మొన!" అంటూ చీరె మార్చుకుంటూ, పరం పరగా ఆమె చేస్తున్న ఆరోపణలన్నీ నిజమేనని గ్రహించిన కిరణ్మయి... గారాలు పోదామా దబాయింపుకు ఉపక్రమిద్దామా అని తేల్చుకునేలోగా వీధిలోంచి ఒక కేక వినిపించింది.

"ఏమ్మా ఆరున్నర యిస్తాను" అంటూన్న సీసాల డబ్బాలవాడి కేక వినిపించింది.

"ఏడున్నర యిస్తే పట్టుకెళ్ళు. లేకపోతే మా సామాను మాకు బరువా ఏమిటి?" అంటూ సుభద్రమ్మ జవాబు. కిరణ్మయి బయటికి పరుగెత్తుకుని వెళ్ళింది.

లోపల్నుంచి వరలక్ష్మి "ఏడున్నరకాదే! తొమ్మిది రూపాయలకి తక్కువైతే యివ్వద్దన్నారు మీ అల్లుడు..." అన్నది. ఆమె కిరణ్మయి గదిలోని చెత్తంతా ఒక మూలకి తోసే ప్రయత్నంలో వుంది.

వీధివేపుకి వెళ్ళిన కిరణ్మయి, రెండు నిముషాల్లో లోపలికి వచ్చి, "అమ్మా యివిగో, తొమ్మిది రూపాయలిచ్చాడు" అని తల్లి చేతిలో పెట్టింది నోట్లు.

"అరె... ఎల్లా యిచ్చాడు కిక్కుర్రు మనకుండా! బలే బేరం ఆడావే?" అంటూ సంబరపడిపోతూ, దగ్గరకు వెళ్ళి "చూడవే అమ్మా.. కిరణ్ ముఖం చూస్తే వాడికి యివ్వ బుద్ధయింది" అని గట్టిగా అరుస్తూ చెప్పింది.

"ఆ! నే చెప్పలే? వాడే వస్తాడు తిక్క తిరిగి అని" అంటూ నవ్విందామె. శాంత పట్టుకొచ్చిన పిండి వంట ఏమిటోనని చూస్తోంది మడి మాట మర్చిపోయి.

మరునాడు కాంటీన్‌లో స్నేహితులకి టీ యిప్పించడం మానేసి, రెండు రూపాయలు డొక్కు డబ్బా అక్కౌంటులో కలిపేసి, ఆ చెత్త విజయవంతంగా వదుల్చుకున్నందుకు కిరణ్మయి మనస్సులోనే తన వీపు తను తట్టుకుంది. చిరునవ్వు కూడా మనస్సులోనే.

అంతకంటే ముందే తను దాచుకున్న సినీ స్టారుల బొమ్మలన్నీ చెత్తబుట్టలో అమ్మ దిమ్మరించేసి, చెత్త వదుల్చుకున్న సమాచారం తెలిస్తే, ఆమె నవ్వు పాతాళానికి పారిపోయేది.